క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



వేమగిరిలో చెత్తతొలగింపు పనులు

కడియం: గ్రామాల్లో పారిశుధ్య పనులపై సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన వేమగిరిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్త, మురుగుకాలువల్లో పూడిక తొలగింపు పనులపై పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీవో వివరించారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై శుక్రవారం ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్, పల్స్ సర్వే, ఆజాదీకాఅమృతోత్సవ్, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలపై ఆయా నోడల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం పల్స్ సర్వేలో భాగంగా రక్షిత మంచినీరుకి ప్రతి ఇంటికి కుళాయిలు వున్నాయా? లేవా? ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని ఆరా తీశారు. శుక్రవారం నుంచి అయిదు రోజుల పాటు ఈ సర్వేను నిర్వహించాలని ఎంపీడీవో వివరించారు. హర్ ఘర్ తీరంగా కార్యక్రమం భాగంగా ఈ నెల 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం, ర్యాలీలు నిర్వహించాలని వివరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం తెలిపారు. దీని ప్రభావంతో శాస్త్రి గారి స్ట్రీట్, ధనలక్ష్మి స్ట్రీట్, ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీ పురం-2, గాంధీ పురం-3, లైఫ్ మెడికల్స్, ముగ్ధ షాపింగ్ మాల్ ఏరియా, శ్యామల నగర్, హోటల్ పంచవతి, జాగృతి బ్లడ్ బ్యాంక్, ప్రకాష్ నగర పోలీస్ స్టేషన్ ఏరియా , శ్యామల నగర్,రామాలయం సెంటర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

భవనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక మల్లయ్యపేటలో భవనంపై నుంచి పడి మరువాడ అజయ్‌రెడ్డి(33) మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం మేగళ్ల గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డి గత నెల రోజులుగా మల్లయ్యపేటలోని బొమ్మకూడలి సమీపంలో మూడంతస్తుల భవనం రోజువారీ కూలీ పనులు చేస్తున్నాడు. ఆ భవనంపై పిట్టగోడ పనులు చేస్తున్న అజయ్‌రెడ్డి ప్రమాదావశాత్తు జారి పడి మృతి చెందాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా యువజన కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్‌లో ప్రధాన మంత్రి అయినా, కేంద్ర మంత్రి అయినా మొదటి యువజన కాంగ్రెస్‌లో చురుగ్గా పని చేసి అనుభవం సాధించిన వారేనని, దేశానికి ఎంతోమంది నాయకులను, ప్రజాప్రతినిధులను అందించిన చరిత్ర యువజన కాంగ్రెస్‌కు ఉందని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో యువజన కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆదేశాల మేరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా యవతతో కలిసి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. యువజన కాంగ్రెస్ నాయకులు సున్నం చంద్రశేఖర్, గురుమూర్తి, విజయ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

ప్రకాశం నగర్: క్విట్ ఇండియా దినోత్సవ ఉద్యమ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధుతో ఆయన మాట్లాడుతూ మోదీ విధానాలు దేశానికి ప్రమాదమని, నేటి ప్రపంచంలో అనేక దేశాల్లో తిరుగుబాటు జరుగుతున్నట్టుగానే భారత్‌లో కూడా పెద్ద ఎత్తున తిరుగుబాటుకు యువత, కార్మికులు, కర్షకులు సన్నద్ధమవుతారని హెచ్చరించారు.

హోల్‌సేల్

- వరుస పండుగల నేపథ్యంలో మార్కెట్‌లో పెరిగిన కొనుగోళ్లు
- కొనుగోలుదారులతో సందడిగా మారిన ప్రధాన సెంటర్లు



మెయిన్ రోడ్డులో వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రకాశంనగర్: మార్కెట్‌కు శ్రావణ శోభా సంతరించుకుంది. కొనుగోళ్లు, విక్రయాలతో సందడిగా మారింది. మహిళలు అత్యంత పవిత్ర మాసంగా భావించే శ్రావణ మాసంలో వరలక్ష్మి వత్రం, రాఖీ పౌర్ణిమ వంటి వరుస పండగల నేపథ్యంలో నగరంలోని ప్రధాన మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. జిల్లా వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరంలో బట్టలు, బంగారం, కిరణా ఇతర ఫాన్సీ సామగ్రి కొనుగోళ్లు ఎక్కువగానే ఉంటాయి. అందులో పండగలంటే అమ్మకాలు మరింత ఆసక్తి చూపుతారు. ముఖ్యంగా మహిళలు, నగరవాసులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో నగరంలోని మెయిన్ రోడ్డు, గుండువారి వీధి, నల్లమందు సందు, టౌన్ హాలు రోడ్డు, సీతమ్మ సందు వంటి ప్రధాన సెంటర్‌లలో కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. దీంతో దుకాణాలు జనంతో కిటాకిటాలాడుతున్నాయి. వస్త్రా వ్యాపారానికి పేరుగాంచిన తాడితోటలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ వంటి



కొనుగోలుదారులతో సందడిగా మారిన మెయిన్ రోడ్డు

ప్రాంతాల్లో అమ్మకాలు పెరగడంతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి.

ప్రత్యేక ఆఫర్లు

శ్రావణ మాసం సందర్భంగా తమ అమ్మకాలను పెంచుకునేందుకు నగరంలోని పలు కార్పొరేట్ బట్టలు, జ్యూయలరీ షాపుల్లో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నాయి. ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితం, బంగారు ఆభరణాల కొనుగోలుపై తరుగు, మజూరీల్లో రాయితీ వంటి ఆఫర్లను ఇస్తున్నాయి. కార్పొరేట్ బట్టల దుకాణాలు సైతం కొనుగోలుదారులకు లక్కీ డ్రా, బంఫర్ డ్రాలో ఖరీదైన కార్లు, బంగారు వస్తువులు, గృహోపకరణాలను బహుమతులుగా అందిస్తున్నాయి. వాటితో పాటు ప్రత్యేక డిస్కౌంట్‌లను ఇవ్వడంతో జనం షాపింగ్ మాల్స్‌లో కొనుగోలు చేసేందుకు క్యూ కడ్తుతున్నారు.

అన్ని రంగాల్లో జోష్

నాలుగు మాసాలుగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు లేకపోవడం ఈ శ్రావణా మాసంలో ముహూర్తాలు ఉండడంతో అన్ని రంగాల కార్మికుల్లో జోష్ కనబడుతోంది. పెళ్లిళ్లకు కల్యాణ మండపాలు, కేటారింగ్ పనులు చేసే వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్, డేకరేషన్ కార్మికులు, ఫంక్షన్ హాలులో పనిచేసే కార్మికుల రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండడంతో ఆయా రంగాల కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కేఆర్ విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ్‌కుమారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని పుస్తక పఠనం చేయాలని, పుస్తకం లేని గది ఆత్మ లేని శరీరం వంటిదన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ అధ్యాపకులు డాక్టర్ బి.అనురాధ, పీఎస్ఎస్ఎస్ఎన్. దుర్గాప్రసాద్, జేఆర్ ఠాగూర్, బి.జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి శ్రావణ శుక్రవారం పూజలు



విద్యుద్దీపాలతో అలంకరించిన రాజమహేంద్రవరంలోని దేవీచౌక్



గాడాలలో విశేష అలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు

- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారికి ఆలయాలు
- గోదావరిలో స్నానమాచరించిన మహిళలు

సీటీఆర్ఐ: సిరుల కురిపించే శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ప్రీతిపాత్రమైన శ్రావణమాసం తొలి శుక్రవారం నగరంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ వెలగులతో ముస్తాబుచేశారు. వేకువజాము నుంచే మహిళలు గోదావరిలో పుణ్యస్నానాలచరించి అమ్మవారి ఆలయాలలో పసుపు, కుంకుమతో పూజలు చేశారు. నగరంలోని వంకాలయ వారి వీధిలోని అష్టలక్ష్మి దేవాలయం, దేవీచౌక్‌లోని శ్రీబాలత్రిపుర సుందరి దేవి ఆలయం, అక్షర పీఠంలోని గాయత్రి మాత, కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న మహాలక్ష్మి ఆలయం, గాడాలలోని శ్రీమహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం కావడం, తొలి శుక్రవారం కావడంతో పూలు, పండ్లు, తులసి మాలలు ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.

ఆర్ట్స్ కళాశాలలో ఎమోషనల్ లెర్నింగ్‌పై శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నోటల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోషల్ ఎమోషనల్ లెర్నింగ్‌పై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఆంధ్ర రాష్ట్ర కళాశాల ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో యునెస్కో సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిని కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులకు సానుభూతి, జాలి, దయ, మనస్సును, శరీరాన్ని సమన్వయం చేసుకోగలడం, భావ ప్రజ్ఞ ఉండడం లేదని, వీటిపై శిక్షణ అత్యంత అవసరమన్నారు. దీనికి అధ్యాపక శిక్షణ కార్యక్రమం ఎంతగానో సహకరిస్తుం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

దన్నారు. కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త సంజీవ్ కుమార్, వివిధ నోడల్ రిసోర్స్ సెంటర్ నుంచి దాదాపు 44 మంది అధ్యాపకులు, 16 మందికీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

హీరోషిమా, నాగసాకి దినోత్సవంపై అవగాహన

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో హీరోషిమా, నాగసాకి దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అణుశక్తి ప్రాధాన్యత, దుష్పరిమాణాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి కోమలలక్ష్మి, కళాశాల అకాడమిక్ సెల్ సమన్వయ కర్త డాక్టర్ సంజీవ్ కుమార్, ఇతర భౌతికశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్టిపడిన జాతీయత



దండి మార్చ్ విగ్రహాల వద్ద జాతీయ జెండాలతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, శ్రీనివాసశర్మ

- హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా జాతీయత ఉట్టిపడేలా, యువతలో దేశభక్తి నింపేందుకు విజయ శంకర ప్రభుత్వ నృత్య పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఈ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు జాతీయ జెండా పట్టుకొని ర్యాలీగా దేశభక్తి గీతాలు ఆలపిస్తూ కంబాచెరువు దండి మార్చ్ విగ్రహాల వరకు, తిరిగి కళాశాల వద్దకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన సిబ్బంది పి.శ్రీనివాసశర్మ, కృష్ణమూర్తి, కేఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జాతిని ఒక్కటి చేసింది జాతీయ జెండా

కడియం: ఆ నాటి 38 కోట్ల భారతీయులను ఒకే తాటిపై తీసుకువచ్చింది ఈ జాతీయ జెండాయేనని కడియం గ్రామ ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురాం(నాని) అన్నారు. హర్ ఘర్ తిరంగా వేడుకలు శుక్రవారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగాయి. ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, వెలుగుబంటి రఘు రామ్‌లు ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. భారత ప్రభుత్వం పిలుపు మేరకు వారం రోజులు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని హెచ్ఎం తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉండాలని ఎస్ఎంసీ సభ్యురాలు బొంతి జ్యోతి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డేవిడ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

బిందు సేద్యం యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: భూగర్భ జలాలు అడుగంటిన తరుణంలో బిందు సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చునని ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) డైరెక్టర్ అడపా దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిందు సేద్యం విధానంలో ఫెర్టిగేషన్ ద్వారా ఎరువులను అందించడంతో ఎరువుల ఖర్చు తగ్గుతుందని, పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. బిందు సేద్యంతో కూలీల ఖర్చు తగ్గుతుందని, కలుపు మొక్కలు నివారించవచ్చని తెలిపారు. ఈ బిందు సేద్యానికి కావాల్సిన పరికరాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తోందన్నారు. కావాల్సిన రైతులు సమీప రైతు సేవ కేంద్రంలో ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రాల జెరాక్స్‌లు, తమ పేర్లను విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్/ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ / విలేజ్ సెరీకల్చర్ అసిస్టెంట్ ద్వారా ఏపీఎంఐపీ యాప్‌లో నమోదు చేసుకోవాలని తలిపారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. తుంపర సేద్యానికి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 55 శాతం, 5 ఎకరాల పైన ఉన్న వారికి 45 శాతం రాయితీతో తుంపర సేద్యం పరికరాలు అందిస్తారన్నారు. జిల్లాకు 2024-25 సంవత్సరానికి 9 వేల హెక్టార్లు భౌతిక లక్ష్యాన్ని నిర్దేశించారని దుర్గేష్ తెలిపారు.

అనధికార డ్యాంతో మునుగుతున్న ఆవ పొలాలు



ముంపునకు గురైన ఆవ పొలాలు

రాజమహేంద్రవరం రూరల్: అనధికారికంగా నిర్మించిన డ్యాం కారణంగా ఆవ భూములు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ మండలం రాజవోలుకు చెందిన రైతులకు కడియం ఆవ ప్రాంతంలోని సర్వే నంబర్ 535 నుంచి 700 వరకూ సుమారు 500 ఎకరాల పంటభూములు ఉన్నాయి. బొమ్మూరు, నామవరం, హుకుంపేట, పాత బొమ్మూరు ప్రాంతాల నుంచి మురుగునీరు రాజవోలు మీదుగా ప్రవహించి కడియం ఆవ మీదుగా ఉన్న మురుగు కాలువలోకి ప్రవహిస్తుంటుంది. రాజవోలు, కడియం గ్రామాలకు మధ్యలో మురుగు కాలువకు డ్యాం ఉంది. ఈ డ్యాం ఇరిగేషన్ రెవెన్యూ శాఖలకు ఎటువంటి సంబంధం లేదని రైతులు పేర్కొన్నారు. కేవలం ఒక వ్యక్తి పొలానికి నీరు తీసుకువెళ్లే నిమిత్తం అక్రమంగా నిర్మించారన్నారు. చిన్న చెక్ డ్యాం కాంక్రీట్ దిమ్మ మాదిరిగా ఉండే కట్టడాన్ని ఒక వ్యక్తి స్వలాభం కోసం డ్యాంగా నిర్మించడంతోపాటు, డ్యాం గేటును ఎప్పుడూ మూసే ఉంచడంతో మురుగునీరు కిందకు ప్రవహించకుండా పక్కనున్న పొలాలు ముంపునకు గురవుతున్నాయని వారు వివరించారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉండడంతో పంట పూర్తిగా పాడైపోయి తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంతాలను పరిశీలించి, తమను ఆదు కోవాలని రైతులు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ డ్యాం రికార్డుల్లో లేదని అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆర్యాపురం అకిరా సెంటర్‌లో సూపర్ స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఆనంద్(నాని) ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, నగర ప్రముఖులు దొండపాటి సత్యంబాబు, రామిరెడ్డి మురళి, అల్లూరి శేషు నారాయణరావు, చింతం వీరబాబు హాజరయ్యి కేక్ కట్ చేశారు. అనంతరం రక్త దానం శిబిరాన్ని ప్రారంభించారు. పేదలకు చీరల పంపిణీ, యువతకు టీ షర్ట్‌లు అందజేశారు. అన్నదానం చేశారు. లంకా ప్రసాద్, హరి గోపాల్, టైరస్, చందు, తరుణ్, చిన్న, తేజ, శ్యాం, భరత్, సురేష్, శంకర్, సురేంద్ర, నారాయణ, మణికంత, అంజి, సాయి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో సెల్ ఫొటోగ్రఫీ కోర్స్

సీటీఆర్ఐ: ప్రస్తుత కాలంలో సెల్ ఫోన్ మనిషిలో అంతర్భాగమైన వస్తువుగా మారిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోనే తొలిసారిగా సెల్ ఫొటోగ్రఫీపై సర్టిఫికెట్ కోర్స్ ప్రవేశపెడుతున్నట్టుగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు ఆధ్వర్యంలో జగతి మీడియా క్రియేషన్స్ సీఈవో శింగన నారాయణమూర్తి, డైరెక్టర్ కోమటి నాగేశ్వరరావుతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ 50 రోజుల పాటు ఈ కోర్స్ ఉచితంగా నేర్పిస్తామని తెలిపారు. ఏ కళాశాల విద్యార్థులైన ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్స్‌పై ఆసక్తి ఉన్న వారు క్లాసులకు హాజరుకావచ్చన్నారు. జగతి మీడియా క్రియేషన్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కోర్సులో మొబైల్ కెమెరా, బేసిక్ ఫొటోగ్రఫీ, కెమెరా సెట్టింగ్స్, కంపోజిషన్ టెక్నిక్స్, ఫ్రేమ్ లైటింగ్, గ్రూప్ ఫొటోగ్రఫీ, మొబైల్ ఎడిటింగ్ యాప్స్, క్రెడిట్ షూటింగ్, అవుట్డోర్ - ఇండోర్ లాంటివి, దీంట్లో ప్రధానంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సణుగుల రాజ్‌కుమార్, పల్లి సుధా, జె.సుగుణ తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 9849579579, 9494441526 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



కోర్సు వివరాలను తెలియజేస్తున్న రాజబాబు తదితరులు

అంబేడ్కర్ స్మృతివనంపై టీడీపీ మూకల దాడి అమానుషం

- రూరల్ నియోజకవర్గంలో పలు చోట్ల నిరసనలు, అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడ నడిబొడ్డులో ఉన్న భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంపై టీడీపీ మూకలు దాడులపై సర్వత్రా విమర్శలు వ్యక్త చేస్తూ నిరసనలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి, అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. రాజవోలు గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం నిరసన తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనంపై దాడులకు పాల్పడిన పచ్చమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కా రాజేంద్రనాథ్, ఎస్.తాతారావు, ముంగమూరి అజయ్‌రత్నాకర్, పేట రామకృష్ణ, కె.కన్నబాబు, సిహెచ్.శ్రీను, ఎ.శ్రీను, కోటిబాలు, బి.కోటిబాబు, జి.సురేంద్ర, పి.సత్తిబాబు, డి.అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.



రాజవోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాజబాబు, నాయకులు

● హుకుంపేట గ్రామంలో మాజీ సొసైటీ చైర్పర్సన్ బొప్పన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నేత బండి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● శాటిలైట్‌సిటి గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్మృతివనంపై దాడులకు పాల్పడిన టీడీపీ మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ బొమ్మశ్రీను, పార్టీ నాయకులు పగడాల లక్ష్మణరావు, పుచ్చా గోవిందరెడ్డి, మీగడ గంగాధర్, కాకుర్తి మురళి, పుచ్చా ప్రసన్నకుమార్‌రెడ్డి, గుబ్బలబాల, పవన్‌రెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్, గోలుకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శాటిలైట్‌సిటిలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

● నగరపాలకసంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లో రాష్ట్ర ఎన్‌రెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ అంగాడి సత్యప్రియ ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, స్మృతివనంలో శిలాఫలకంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడం అమానుషమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేబుల్ శ్రీను, కరెంటు ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.



హుకుంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బొప్పన సుబ్బారావు, బండినాగేశ్వరరావు

ఓల్డేజ్ హోమ్‌లోని వృద్ధురాలి అదృశ్యం



వేగిరాజు సావిత్రి (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: తమ ఓల్డేజ్‌హోమ్‌లో ఉంటున్న 75 ఏళ్ల వేగిరాజు సావిత్రి ఈనెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదని శుక్రవారం రూత్ ఓల్డేజ్‌హోమ్ నిర్వాహకుడు బి.కోటేశ్వరరావు బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బొమ్మూరు గ్రామానికి చెందిన బి.కోటేశ్వరరావు అదే గ్రామంలో మురళీకొండప్రాంతంలో రూత్ ఓల్డేజ్‌హోమ్ నిర్వహిస్తున్నారు. కొంత కాలం క్రితం 75 ఏళ్ల వేగిరాజు సావిత్రి ఓల్డేజ్ హోమ్‌లో జాయిన్‌అయ్యింది. ఈనెల 6వ తేదీ ఉదయం ఆరు గంటల సమయంలో చూసేసరికి కనిపించలేదని కోటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.